సాక్షి
ఆదిలాబాద్

సోమవారం। 9। అక్టోబర్। 2023



దోమ తెరలేవి?
ఏజెన్సీ పరిధిలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే డెంగీతో పలువురు మృత్యువాత పడ్డారు. దోమతెరలు పంపిణీ చేయాలని గిరిజనులు కోరుతున్నారు. 8లో▸

పీవైఎల్ జిల్లా కమిటీ
ఎదులాపురం: పీవైఎల్ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కాశీనాథ్ వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా జి.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా ఆత్రం వినోద్, ఉపాధ్యక్షులుగా వై.దుర్గా, సహాయ కార్యదర్శిగా అనిల్, కోశాధికారిగా దొందిరావ్, సభ్యులుగా దిలీప్, కిరణ్, సురేష్, నాగేష్, అర్జున్, కృష్ణ, గజ్, అనందరావ్ ఎన్నికయ్యారు.

గరిష్టం/కనిష్టం
35.0/23.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రి పర్యటనకు భారీ బందోబస్తు



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఈనెల 10న జిల్లాకు రానుండడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. పట్టణంలోని డైట్ కళాశాల మైదానంలో బహిరంగ సభ వద్ద ఏర్పాట్లను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. భద్రత చర్యలు, ట్రాఫిక్‌పై సమీక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. మూడంచెల భద్రత కల్పిస్తామని పేర్కొన్నారు. ఎస్పీ వెంట వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నాగోబా ఆలయంలో పూజలు
ఇంద్రవెల్లి: కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో ఆదివాసీలు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మొక్కు తీర్చుకుని తమ కుటుంబాలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, గ్రామ పెద్దలు బాదిరావ్‌పటేల్, కోసేరావ్, కొట్నాక్ బారిక్‌రావ్, సాగర్, నాగ్‌నాథ్, తదితరులున్నారు.

విద్యార్థులు నష్టపోకుండా చూడాలి
ఆదిలాబాద్‌టౌన్: బదిలీలు పొందిన స్కూల్ అసిస్టెంట్లను విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలల్లో చేరేందుకు అవకాశం కల్పించాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు డీఈవో ప్రణీతను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు.

17 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి
కైలాస్‌నగర్: జిల్లా రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులుగా పనిచేస్తున్న 17 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయి. ఈమేరకు సీసీఎల్ఏ సెక్రటరీ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పదోన్నతులు పొందిన వారిలో రొడ్డ నర్సింలు, రాథోడ్ సురేందర్, ఎండీ సాజిద్, సెద్మికి తిరుపతి, కుమ్మరి సాయిరాం, ఎస్.భరద్వాజ్, బి.కార్తీక్, విజయకుమార్, ఎండీ అత్తారుద్దీన్, ఎస్. జ్ఞానేశ్వర్, సయ్యద్ మెహ్రాజ్, జింకల మమత, నవత, జ్యోతి, రఘురామయ్య, ఎస్.నరేందర్, తేజస్విని, షేక్ ఆల్మస్ ఉన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం (ఫైల్)

మధ్యాహ్నం తంటా!

- 20 రోజులుగా సమ్మెలోనే మధ్యాహ్న భోజన కార్మికులు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- ప్రత్యామ్నాయ చర్యల్లో గురువులు
- కొంతమంది చిన్నారులు ఇంటి నుంచే టిఫిన్ బాక్స్

జిల్లాలో పాఠశాలల వివరాలు..

కేటగిరి	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	925	46,344
ప్రాథమికోన్నత	111	25,122
ఉన్నత	110	12,089
మొత్తం	1146	83,555

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు మధ్యాహ్న భోజనం కోసం తంటాలు పడుతున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న నిర్వాహకులు 20 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన విషయం తెలిసిందే. దీంతో ఇటు విద్యార్థులకు, అటు గురువులకు అవస్థలు తప్పడం లేదు. భోజనం తప్పనిసరిగా పెట్టాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ చేయడంతో ఉపాధ్యాయులు ప్రత్యామ్నా య చర్యలు చేపడుతున్నారు. మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో ఈ పథకం నిలిచిపోయినట్టు తెలుస్తోంది. ప్రత్యామ్నాయంగా చర్యలు చేపట్టి ఇతరులతో భోజనం చేయిస్తున్నప్పటికీ సమయానికి అందడం లేదు. నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేంత వరకు సమ్మె విరమించేది లేదని మధ్యాహ్న భోజన కార్మికులు భీష్మించుకు కూర్చున్నారు. ప్రతిరోజు ఏదో రూపంలో నిరసనలు చేపడుతున్నారు.

సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట..

సమస్యల పరిష్కారం కోసం గతనెల 20న మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెబాట చేపట్టారు. సోమవారం నాటికి 20 రోజులు పూర్తి కానున్నాయి. పెండింగ్ బిల్లులు, పెంచిన గౌరవ వేతనం చెల్లించాలని సమ్మె చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. విద్యాశాఖ అధికారుల లెక్కల ప్రకారం.. జిల్లాలో 1,146 పాఠశాలల్లో 1,786 కుక్, హెల్పర్లు పనిచేస్తున్నారు. అయితే విద్యాశాఖాధికారులు పెండింగ్ బిల్లులు విడుదల చేశామని, ట్రెజరి నుంచి విడుదల కావాల్సి ఉందని రెండు నెలలుగా చెబుతున్నారు. అధికారుల వివరాల ప్రకారం.. 1నుంచి 8వ తరగతులకు సంబంధించిన పాఠశాలల్లో రూ.వెయ్యి గౌరవ వేతనం జూలై వరకు చెల్లించామని పేర్కొంటున్నారు. పెంచిన గౌరవ వేతనంకు సంబంధించి రూ.2వేల చొప్పున బడ్జెట్ మార్చి 2024 వరకు వచ్చిందని చెబుతున్నారు. సెప్టెంబర్ వరకు బిల్లులు విడుదలయ్యాయని, ట్రెజరిలో పెండింగ్‌లో ఉందంటున్నారు. గుడ్ల బిల్లులు కూడా సెప్టెంబర్ వరకు విడుదల అయ్యాయని పేర్కొంటున్నప్పటికీ కార్మికులు మాత్రం తమకు ఆరేడు నెలల నుంచి గౌరవ వేతనం, ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.3వేల గౌరవ వేతనం, గుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అంటున్నారు. అప్పు చేసి విద్యార్థులకు వంటచేసి పెడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఒక కోడిగుడ్డుకు రూ.నాలుగున్నర చెల్లిస్తుందని, బయట మార్కెట్‌లో మాత్రం రూ.6వరకు ఉందని పేర్కొంటున్నారు.

పస్తులతోనే చదువులు..

జిల్లాలో ఆయా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుంది. అయితే గతనెల 20 నుంచి ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ సంఘాలకు సంబంధించిన కార్మికులు సమ్మెలో దిగారు. దీంతో ఆయా పాఠశాలల్లో కార్మికులు భోజనం వండటం లేదు. కొన్నిచోట్ల ఉపాధ్యాయులు గ్రామంలో ఇతరుల ద్వారా వండిపెడుతున్నారు. అయితే నాణ్యమైన భోజనం అందడం లేదు. కొన్ని పాఠశాలల్లో ఈ పథకం నిలిచిపోయింది. విషయాన్ని అధికారులు బయటకు రాకుండా కప్పిపుచ్చుతున్నారు. గ్రామాల్లో తల్లిదండ్రులు చేను, ఇతర పనులకు వెళ్తుండడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. కొంత మంది ఇంటికి వెళ్లి భోజనం చేస్తుండగా, మరికొంత మంది విద్యార్థులు టిఫిన్ బాక్సులు తెచ్చుకొని పాఠశాలల్లో తింటున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె..
మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మె చేపడతాం. పెండింగ్ బిల్లులు విడుదలలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెలకు కనీసం వేతనం రూ.26వేలు చెల్లించాలి. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి. కోడి గుడ్ల ధర పెంచాలి. సీఎం ప్రకటించిన గౌరవ వేతనం రూ.3వేలు వెంటనే విడుదల చేయాలి.

– కుంటాల రాములు, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు

బిల్లులు విడుదల చేశాం



మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు జూలై వరకు చెల్లించాం. గౌరవ వేతనంకు సంబంధించి మార్చి వరకు బడ్జెట్ విడుదలైంది. సెప్టెంబర్ వరకు గౌరవ వేతనం, బిల్లులు విడుదల చేశాం. ట్రెజరిలో పెండింగ్‌లో ఉన్నాయి. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఉపాధ్యాయులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి భోజనం అందించేలా చూస్తున్నారు.

– ప్రణీత, డీఈవో

అంతా అలర్ట్..



లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు
- తనిఖీల ప్రక్రియ షురూ
- 'కోడ్'కు ముందే యంత్రాంగం అప్రమత్తం
- మద్యం, డబ్బు ప్రవాహ అడ్డుకట్టకు చర్యలు

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా విజయవంతంగా నిర్వహించేలా కసరత్తు ముమ్మరం చేసింది. ఎన్నికల విధులు నిర్వహించనున్న అధికారులు, ఉద్యోగులతో సమావేశాలు నిర్వహిస్తూనే.. మరోవైపు మద్యం, డబ్బు ప్రవాహానికి అడ్డుకట్ట వేసేదిశగా ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాను ఆనుకుని మహారాష్ట్ర ఉండటంతో పాటు 44వ జాతీయ రహదారి వెళ్తుండటంతో కోడ్ కూతకు ముందే అధికారులు అప్రమత్తమయ్యారు. సరిహద్దు ప్రాంతాలపై ఫోకస్ పెంచారు. రెగ్యులర్ చెక్‌పోస్టులే కాకుండా ఎన్నికల కోసం ప్రత్యేకంగా కొన్నింటిని ఏర్పాటు చేశారు. సిబ్బందిని సైతం నియమించారు. పోలీసు, అబ్కారీ, రవాణా, అటవీశాఖల అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఉన్నతాధికారులు స్వయంగా చెక్‌పోస్ట్‌లను సందర్శించి అక్కడ అనుసరించాల్సిన కార్యాచరణపై సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. దీంతో నోటిఫికేషన్‌కు ముందే నిఘా పెరిగింది.

సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు..

ఎన్నికలేవైనా మద్యం, మత్తు పదార్థాలు, ధన ప్రవాహమనేది ఇటీవల సర్వసాధారణంగా మారింది. పోటీ చేసే అభ్యర్థులతో పాటు వివిధ రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు విచ్చలవిడిగా మద్యం, డబ్బు పంపిణీ చేయడం ఓ తంతుగా మారింది. రానున్న ఎన్నికల్లో ఇలాంటి వాటికి పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయాలని యంత్రాంగం భావిస్తోంది. జిల్లా సరిహద్దుల్లో నిఘా కట్టుదిట్టం చేస్తోంది. ఇందుకోసం జైనథ్ మండలంలోని భోరజ్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ కాకుండా మహారాష్ట్రను ఆనుకుని ఉన్న బేల మండలంలోని శంకర్‌గూడ, జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్, పిప్పర్‌వాడ, భీంపూర్ మండలంలోని కరంజి, గాదిగూడలోని మేడిగూడ, తలమడుగు మండలంలోని లక్ష్మిపూర్, బోథ్ మండలంలోని ఘన్‌పూర్‌లలో ప్రత్యేక చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేసింది. వీటిలో పోలీసు, ఎక్సైజ్ శాఖలు ప్రత్యేక సిబ్బందిని నియమించాయి. 24 గంటల పాటు మూడు షిఫ్టులుగా విధులు నిర్వహించేలా బాధ్యతలు అప్పగించారు. వీరు ఇప్పటినుంచే తనిఖీలు షురూ చేశారు. అనుమానాస్పదంగా కనిపించే వాహనాలన్నింటినీ సోదా చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం, డబ్బు జిల్లాలోకి ప్రవేశించకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. నోటిఫికేషన్ విడుదలయ్యాక మోడల్ కోడ్ టీమ్‌లు రంగంలోకి దిగడంతో చెక్‌పోస్టుల్లో నిఘా మరింత పటిష్టం కానుంది.

ఉన్నతాధికారుల తనిఖీలు..
జిల్లా సరిహద్దుల్లోని వివిధ మండలాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను జిల్లా ఉన్నతాధికారులు తనిఖీ చేస్తూ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నర్సింహారెడ్డిలు ఈ చెక్‌పోస్టులను ఇప్పటికే తనిఖీ చేశారు. కలెక్టర్ లక్ష్మిపూర్, భోరజ్ చెక్‌పోస్టులను తనిఖీ చేయగా, ఎస్పీ, ఎక్సైజ్ డీసీ పిప్పర్‌వాడ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టును పరిశీలించారు. వాటి నిర్వహణపై ఆరా తీయడంతో పాటు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని అక్కడి ఉద్యోగులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ క్రమంలో సరిహద్దులో తనిఖీలు పకడ్బందీగా చేపడుతున్నారు. నిఘా కట్టుదిట్టమైంది.

- జాతీయ ఇన్‌స్పైర్ పోటీలకు ఉమ్మడి జిల్లా విద్యార్థులు
- అత్యుత్తమ ప్రాజెక్టులతో రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా..
- న్యూఢిల్లీలో నేటి నుంచి జాతీయ ప్రదర్శనలు
- ఆల్‌ది బెస్ట్ చెబుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గల్లీ నుంచి ఢిల్లీకి..

మంచిర్యాలఅర్బన్: పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు, సంస్కృతి పెంపొందించేందుకు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్-ఇండియా ఆధ్వర్యంలో ఇన్‌సైన్స్ పర్స్యూట్ ఇన్‌స్పైర్ రీసెర్చ్(ఇన్‌స్పైర్ మనక్) అవార్డుకు జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది నిర్వహించే పోటీలకు ఉమ్మడి జిల్లానుంచి నలుగురు ఎంపికయ్యారు. ఇందులో మంచిర్యాల నుంచి ఇద్దరు, నిర్మల్, ఆదిలాబాద్ నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. జనవరిలో నిర్మల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. న్యూఢిల్లీలో ఈనెల 9నుంచి 11వరకు నిర్వహించే పోటీలకు రాష్ట్రం నుంచి 26 మంది తమ ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు. ఇందులో మంచిర్యాల జిల్లాకు చెందిన జిమ్మిసి మణిప్రసాద్, కందుల ఖుషీంద్రవర్మ ఎంపికైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. అలాగే నిర్మల్ నుంచి రమ్యకృష్ణ, ఆదిలాబాద్ నుంచి మహ్మద్ కాసిఫ్ ఉన్నారు.

గతంలోనూ జాతీయస్థాయిలో మెరిసి..

విద్యార్థులు గతంలోనూ జాతీయస్థాయిలో మెరిశారు. సర్కారు బడిలో చదువుతున్న మల్లేపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థి జుమ్మిడి అంజన్న తన మేదస్సుకు పదునుపెట్టి జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. 2019–20లో జాతీయ స్థాయిపోటీల్లో ఫీడింగ్ చాంబర్ ప్రాజెక్టుతో ఉత్తమ ప్రదర్శనతో నాలుగో స్థానంలో నిలిచాడు. 2019లో నెన్నెల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నవీన్‌కుమార్ ఇన్‌స్పైర్‌మనక్‌లో జాతీయస్థాయిలో ప్రోత్సాహక బహుమతి సాధించాడు. చెరువులు, వాగులు, సరస్సుల్లో నిండిన చెత్తను సౌరశక్తి విధా నం ద్వారా తొలగించటానికి రూపొందించిన గార్బే జ్ రిమూవర్ ఫర్ స్వచ్ఛ వాటర్ అనే ప్రదర్శనతో మెప్పించాడు. 2020–21లో శ్రీచైతన్య పాఠశాలకు చెందిన సాయిలు సాయిశ్రీవల్లి రూపొందించిన రుతుమిత్ర కిట్ పరికరం జాతీయస్థాయిలో ఆకట్టుకుంది.

ప్రాజెక్టుతో మణిప్రసాద్, జెడ్పీహెచ్‌ఎస్, అన్నారం, కోటపల్లి



రెయిన్ ప్రొటెక్టర్..
రైతులు పండించిన పంట ఆరబోసినప్పుడు రైతులు అందుబాటులో లేనప్పుడు వర్షం వస్తే ధాన్యం తడిసిపోతుంది. అలాగే పశువులు తిని చిందరవందరగా చేస్తాయి. దీనిని నివారించేందుకు రెయిన్ ప్రొటెక్టర్ ఫ్రైయిన్ అండ్ ఎనిమిల్స్ ప్రాజెక్టు దోహదం చేస్తుంది. కర్రలు, ప్లాస్టిక్ పైపులు, కవర్లు, రెయిన్ సెన్సార్, మోటార్ ప్రోగ్రామింగ్ మైక్రో కంట్రోలర్, సోలార్ ప్లేట్, 12 వోల్టేజ్ బ్యాటరీ, బజాజ్ 1.5వీ బ్యాటరీలతో ప్రాజెక్టును రూపొందించారు. పశువుల బారి నుంచి కాపాడుకోవటం.. వర్షం పడినప్పుడు ధాన్యం తడవకుండా ఆటోమెటిక్ యంత్రంతో కప్పి ఉంచడమే ప్రాజెక్టు ఉద్దేశం.

డ్రెయినేజీ అండ్ రోడ్ క్లీనర్..
– ప్రాజెక్టుతో కందుల ఖుషీంద్రవర్మ, గుడ్ షెపర్డ్ హైస్కూల్, లక్సెట్టిపేట



మున్సిపల్, పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తగ్గించడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇనుపరాడ్లు, చువ్వలు, బాల్‌రింగ్‌లు, గొలుసులు, టైర్లు, సోలార్ ప్యానెల్, లైట్ మొదలైన వాటితో తయారు చేసిన సాధారణ యంత్రం. కార్మికులు రోడ్లు, డ్రైనేజీలోని చెత్తను చేతులతో చేస్తుంటారు. పారిశుధ్య కార్మికులు తమ పనిని సులభతరం చేయటానికి, వ్యర్థకణాలతో టచ్ కమ్యూనికేషన్‌ను తగ్గించటానికి ఉపయోగపడుతుంది.

అనారోగ్యంతో ఆదిలాబాద్ విద్యార్థి గైర్హాజరు
ఆదిలాబాద్‌టౌన్: తన మేదస్సుకు పదును పెట్టి నూతన ఆవిష్కరణ తయారు చేసిన జిల్లా విద్యార్థి అనారోగ్యంతో జాతీయ ఇన్‌స్పైర్ మేళాకు దూరమయ్యాడు. ఆదిలాబాద్ పట్టణంలోని యూపీఎస్ ఖానాపూర్‌కు చెందిన మహ్మద్ కాసిఫ్ 8వ తరగతి చదువుతున్నాడు. ఆటోమెటిక్ క్రాఫ్ట్ డ్రయర్ తయారు చేశాడు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన మేళాలో ప్రదర్శించాడు. నిర్మల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చడంతో జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మేళాకు ఎంపికయ్యాడు. ఈనెల 9 నుంచి 11 వరకు ఢిల్లీలో ప్రాజెక్ట్ ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. అయితే కాసిఫ్ ఇటీవల అనారోగ్యం బారిన పడడంతో ఈ మేళాలో పాల్గొనకుండా దూరమయ్యాడని జిల్లా సైన్స్ అధికారి రఘురమణ తెలిపారు.

జాతీయస్థాయిలో రాణించాలి
జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులు జాతీయస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో రాణించాలి. అత్యుత్తమ ప్రదర్శన చేసి టాప్ 60లో స్థానం సాధించి జాతీయ అవార్డు కైవసం చేసుకోవాలి. విద్యార్థులకు ఎస్కార్ట్‌గా టీచర్ వెళ్లారు. మణిప్రసాద్, ఖుషీంద్రవర్మకు ఆల్‌దిబెస్ట్.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

బోథ్ ఏం పాపం చేసింది..!?

- అన్ని అర్హతలున్నా 'డివిజన్'గా ప్రకటించట్లే!
- ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాల్సిందే..
- దీక్షలు కొనసాగుతున్నా స్పందించరెందుకు?
- అవసరమైతే ఎన్నికలను బహిష్కరిస్తాం..
- స్పష్టం చేస్తున్న 'డివిజన్ సాధన సమితి'



డివిజన్ కోసం కొనసాగుతున్న దీక్ష (ఫైల్)

బోథ్: 'మండలం.. డివిజన్ ఏదైనా సరే అంతటా అడిగిన వారికి లేదనకుండా ఇచ్చేస్తున్నారు.. బోథ్ మాత్రం ఏం పాపం చేసింది..? అన్ని అర్హతలున్నా ఎందుకు రెవెన్యూ డివిజన్ ప్రకటించట్లేదు.. ఇవి ఈ ప్రాంతవాసుల్లో ప్రస్తుతం మెదులుతున్న ప్రశ్న. ఒకప్పుడు తాలుకా ప్రాంతంగా వెలుగొందిన బోథ్‌ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న భావన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన నేతలు పత్తా లేకుండా పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 85 రోజులుగా అలుపెరగని దీక్ష సాగిస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికార పార్టీ నాయకులపై ఆగ్రహం..

బోథ్ డివిజన్ ఏర్పాటు ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక. రెవెన్యూ డివిజన్‌గా మారుస్తామని ప్రజాప్రతినిధులు సైతం హామీ ఇచ్చారు. ఏళ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోకపోవడంతో మండలమంతా ఏకమై డివిజన్ సాధన సమితి పేరిట ఆందోళన బాట పట్టారు. దాదాపు మూడు నెలలుగా దీక్ష కొనసాగిస్తున్నారు. ఓ వైపు ఉమ్మడి జిల్లాలో చెన్నూర్‌ను తాజాగా డివిజన్‌గా ప్రకటించిన నేపథ్యంలో బోథ్ మాత్రం ఏం పాపం చేసిందని వాపోతున్నారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు రాజీనామా చేసి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరుతున్నారు. తమ ఆకాంక్ష నెరవేర్చని పార్టీలను రాబోయే రోజుల్లో ఓడిస్తామని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం రాథోడ్ బాపూరావుకు అధిష్టానం టికెట్ కేటాయించకపోవడంతో ఆయన బోథ్ మండల పర్యటనకు దూరంగా ఉన్నారు.

ఎన్నికల బహిష్కరణ దిశగా..

బోథ్ డివిజన్ ఏర్పాటు చేయకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని డివిజన్ సాధన సమితి ఇప్పటికే స్పష్టం చేసింది. అలాగే 200 మందితో నామినేషన్ వేయించాలని నిర్ణయించింది. ఏర్పాట్లు సైతం చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పాలకులు పట్టించుకోవట్లేదు



బోథ్ ఒకప్పుడు తాలుకా కేంద్రంగా ఉండేది. ప్రస్తుతం నియోజకవర్గ కేంద్రంగా ఉంది. డివిజన్‌కు కావాల్సిన అన్ని అర్హతలున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. మా అస్థిత్వాన్ని కాపాడుకుంటాం. ఇప్పటికే ఉద్యమబాట పట్టాం. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం.– అబూద్, బోథ్

ఎన్నికల్లోపు ప్రకటించాలి



ఎన్నికల్లోపు బోథ్‌ను డివిజన్‌గా ప్రకటించాలి. ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. ఈ ప్రాంతవాసుల ఆకాంక్ష నెరవేర్చాలి. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం. అవసరమైతే ఎన్నికలను బహిష్కరిస్తాం. 200 మందితో నామినేషన్ వేయిస్తాం.

– అల్లం సాయి, బోథ్

క్లుప్తంగా

నూతన అటవీ చట్టాన్ని ఉపసంహరించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన అటవీ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు కోవ సునీల్ డిమాండ్ చేశారు. కేంద్రహోంమంత్రి అమిత్‌షా ఈనెల 10న ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక బాలుర వసతి గృహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. అటవీ చట్టం అమలు అయితే పర్యావరణానికి, ఆదివాసీలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం ఆదివాసీలకు ఉద్యోగాలు కల్పించే జీవో నెంబర్ 3ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. నాయకులు గణేశ్, మురళీ, శ్రీకాంత్, లింగు, గంగారాం ఉన్నారు.

నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు



బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేస్తున్న రూరల్ ఎస్సై

నిర్మల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని లంగ్డాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద ఆదివారం సాయంత్రం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించారు. వాహనదారులకు బ్రీత్‌ఎనలైజర్ పరీక్ష చేయగా నలుగురు మద్యం తాగినట్లు తేలిందని ఎస్సై పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి గ్రామంలో ఆదివారం 11 మంది పేకాటారాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి వారి వద్ద నుంచి రూ.51,270 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె రాత్రివరకు తిరిగి రాలేదు. దీంతో ఆదివారం ఆమె తల్లి టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో పశువులకు గాయాలు

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రానగర్ సమీపంలో గల మెట్‌పల్లి ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు వద్ద ఉన్న పశువులను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాయి. మూగజీవాలకు చికిత్స అందించే విషయమై సంబంధిత అధికారులకు స్థానికులు ఫోన్‌లో సమాచారం అందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను.ఫ్రీవసతి + భోజనం. జీతం: 18K. Ph: 9640400073/ 9848571888 [HA-189337]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

దోమ తెరలేవి?

‘‘నా పేరు రాము.. మాది గాదిగూడ మండలంలోని లోకారి గ్రామం. రెండేళ్ల క్రితం మా నానమ్మకు జ్వరం వచ్చింది. ఆదిలాబాద్ రిమ్స్‌లో వైద్యం చేయించాము. డెంగీ నిర్ధారణ అయింది. రెండు రోజులు అక్కడే వైద్యం చేయించాం. నాల్గో రోజు చనిపోయింది. గప్పుడు నా ఇంటికి వచ్చిన పెద్దసార్లు దోమ తెరలు ఇచ్చారు. మళ్లీ రెండేళ్ల నుంచి ఇవ్వలేదు.’’

‘‘నా పేరు సంజయ్.. నార్నూర్ మండలంలోని ఉమ్రీ గ్రామం. ఇటీవల కురిసిన భా రీ వర్షానికి గ్రామాల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. చాలా మంది గ్రామాల్లో విష జ్వరంతో బాధ పడుతున్నారు. ఇప్పటికే రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. గతంలో ఇచ్చిన దోమ తెర చినిగిపోయింది. ఈ ఏడాది దోమ తెరలను పంపిణీ చేయాలి.’’



నార్నూర్ మండలం భీంపూర్‌లో దోమ తెరలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

- ఏజెన్సీ పరిధిలో దోమల విజృంభన
- విస్తరిస్తున్న డెంగీ
- విషజ్వరాలతో ఇప్పటికే పలువురు మృత్యువాత
- ముందస్తు రక్షణ చర్యలు విస్మరించిన ఐటీడీఏ

నార్నూర్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం దోమ తెరలను పంపిణీ చేయడం లేదు. ఏజెన్సీ ప్రాంతంలో 2017లో దోమతెరలు పంపిణీ చేసిన కుటుంబాల సంఖ్య ఆధారంగా మళ్లీ 2021లో దోమ తెరలు ప్రభుత్వం పంపిణీ చేసింది. కానీ ఈ రెండేళ్లలో దోమతెరలు పంపిణీ చేయకపోడంతో గిరిజనులు సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు.

ఏజెన్సీలో... నమోదు

ఏజెన్సీలో మొత్తం 32ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అందులో మొత్తం ఇప్పటి వరకు 47 డెంగీ కేసులు నమోదయ్యాయి. మలేరియా ఒక కేసు నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 1.99 లక్షల మంది గిరిజనులు నివసిస్తున్నారు. వర్షాకాలం మొదలైందంటే గిరిజనులు దోమకాటుతో మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం 2016లో జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీ గిరిజనులకు దాదాపు 70వేల దోమ తెరలు పంపిణీ చేసింది. 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 2017లో 40,400 దోమతెరలు అందించగా కుటుంబాల సంఖ్య ఆధారంగా 2021లోనూ అందజేసింది. ప్రస్తుతం వర్షాలు బాగా కురవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

అవగాహనేది..?

గిరిజన ప్రాంతాల్లో జ్వరాల తీవ్రతకు దోమ వ్యాప్తి కారణమని గుర్తించిన ప్రభుత్వం 2016 నుంచి ఇప్పటివరకు గిరిజన కుటుంబాలకు ఐటీడీఏ ద్వారా దోమ తెరలు అందించింది. 2016లో 70,859 దోమ తెరలను మలేరియా కేసులు అత్యధికంగా నమోదైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందించింది. 2020లో అవే పీహెచ్‌సీలకు 70,859 దోమ తెరలను పంపిణీ చేయగా 2021లో 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 40,400 దోమ తెరలను ఏజెన్సీ వైద్యశాఖ జిల్లా వ్యాప్తంగా అందించింది. నాణ్యత గల దోమ తెరలు కావడంతో నాలుగైదేళ్లపాటు వాడుకోవచ్చని అధికారులు తెలిపారు. అంతేకాకుండా ప్రతీ ఆరు నెలలకోసారి వీటిని దోమల నివారణ మందు డెల్టా మైత్రిన్‌లో వేసి శుభ్రం చేసుకోవడం ద్వారా ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని చెబుతున్నారు. కానీ చాలా చోట్ల అవగాహన లేమితో గిరిజనులు దోమ తెరలను శుభ్రం చేసుకోలేదు. దీంతో అవి అనతికాలంలోనే పాడైపోతున్నాయి. వాటి వాడకంపై సరైన అవగాహన కల్పించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

మూడేళ్లుగా ఐటీడీఏ పరిధిలో నమోదైన డెంగీ, మలేరియా కేసుల వివరాలు

ఏడాది	మలేరియా	డెంగీ
2021	02	119
2022	02	123
2023	01	47

కేసులు తక్కువగా నమోదవుతున్నాయి



ఏజెన్సీలోని మలేరియా పూర్తిగా అదుపులో ఉంది. ఇప్పటి వరకు రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయి. డెంగీ కేసులు పెరుగుతున్నాయి. అందుకోసమే ఈ ఏడాది దోమ తెరలను పంపిణీ చేయడం లేదు. ప్రభుత్వం నుంచి పంపిణీ లేదు. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తా. గతంలో పంపిణీ చేసిన దోమ తెరలను రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు వాడుకోవచ్చు.

– శ్రీధర్, జిల్లా మలేరియా అధికారి, ఆదిలాబాద్

ట్రిపుల్‌ఐటీని హరితవనంగా తీర్చిదిద్దుతాం

- వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ



మొక్కలు నాటుతున్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీని హరితవనంగా తీర్చిదిద్దుతామని వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. ట్రిపుల్‌ఐటీలో గర్ల్స్ హాస్టల్ -1,2తోపాటు ఉద్యోగుల గృహసముదాయ పరిసరాల్లో ఆదివారం పండ్ల మొక్కలు నాటారు. ఇప్పటి వరకు 4 వేల పండ్ల మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ట్రిపుల్‌ఐటీలో ప్రధాన రోడ్లకు ఇరువైపులా పచ్చని మొక్కలు పెంచుతున్నామన్నారు. ఈయేడు కూడా ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామన్నారు.

మొక్కలు పంపిణీ..

బాసర ట్రిపుల్‌ఐటీలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీలో భాగంగా ట్రిపుల్‌ఐటీ ఎస్బీఐ క్యాంపస్ మేనేజర్ మనోజ్‌రెడ్డి మొక్కలు పంపిణీ చేశారు. ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులంతా ఈ మొక్కలను ప్రాంగణంలో నాటారు. జామ, ఉసిరి, సపోట, మామిడి, సీతాఫలం, నేరేడి, పనస, నిమ్మకాయ, రావి తదితర పండ్ల మొక్కలను వలంటీర్లు నాటారు. నాటిన మొక్కలను పూర్తిస్థాయిలో సంరక్షిస్తామని ఈ సందర్భంగా డైరెక్టర్ సతీశ్‌కుమార్ అన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి, క్యాంపస్ బ్యూటిఫికేశన్ కన్వీనర్ గజ్జల శ్రీనివాస్, అడిషనల్ చీఫ్ వార్డెన్ సుజాత పాల్గొన్నారు.

13 నుంచి జోనల్‌స్థాయి పోటీలు



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్సీఓ, ప్రిన్సిపాళ్లు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ)లో ఈనెల 13 నుంచి జరగనున్న 9వ జోనల్ స్థాయి క్రీడాపోటీలను సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీఓ స్వరూపరాణి అన్నారు. ఆదివారం సీఓఈ కళాశాల క్రీడా పోటీల వేదిక అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లతో సమీక్ష సమావేశంలో మాట్లాడారు. క్రీడల నిర్వహణకు తక్కువ సమయంలో వేగవంతంగా మైదానాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఐనాల సైదులును అభినందించారు. అలాగే విద్యార్థులకు వసతి, ఆహారం ఇతరాత్ర సౌకర్యాల కల్పనలో సంబంధిత కమిటీల ఇన్‌చార్జీలు సత్వరం పనులు పూర్తిచేయాలని సూచించారు. అంతకుముందు ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల డీసీఓలు శ్రీనివాస్, బాలరాజు, బాలభాస్కర్ ఆధ్వర్యంలో పలు కమిటీలను ఆర్సీఓ ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు. ప్రిన్సిపాల్ సైదులు అధ్యక్షతన ఫుడ్, ఫైనాన్స్, కల్చరల్ తదితర 22 కమిటీలను ఏర్పాటు చేశారు. క్రీడాపోటీల నిర్వహణను ఏ లోటు లేకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రిన్సిపాళ్లు సంధ్యారాణి, సంతోష్‌కుమార్, వినోద్, సాదా, జ్యోతి, స్వరూప, లలితకుమారి, సీనియర్ అధ్యాపకులు మహేశ్వర్‌రావు, రమేశ్, ఎల్లయ్య, కోట రాజ్‌కుమార్, ప్రమోద్‌కుమార్, రాజ్‌కుమార్, దత్తప్రసాద్ పాల్గొన్నారు.

సైబర్ వలలో అసిస్టెంట్ ప్రొఫెసర్

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ మోసగాళ్ల వలలో రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ చిక్కుకున్నారు. ఇన్‌స్టాగామ్‌లో గిఫ్ట్ వచ్చిందని ఫోన్ చేశారు. దీంతో వారి మాటలు నమ్మి ఆన్‌లైన్ ద్వారా నగదు పంపించారు. జూలై 21న ఇన్‌స్టాగామ్ ద్వారా ఫోన్ వచ్చింది. మొదట రూ.10 వేలు, ఆ తర్వాత ఇతర వాటి కోసం డబ్బులు చెల్లించాలని రూ.18 వేలు, మరోసారి రూ.8500.. ఇలా మొత్తం రూ.36,500లు వారికి అందాయి. గిఫ్ట్ కోసం వేచిచూస్తోంది. వారికి ఫోన్ చేసినప్పటికీ లిఫ్ట్ చేయకపోవడంతో సైబర్ మోసానికి గురైనట్లు గ్రహించింది. శనివారం టూటౌన్ పోలీసు స్టేషన్ లోఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలి



మాట్లాడుతున్న సుకుమార్ పెట్కూలే

ఎదులాపురం: మాలీలకు ఎస్టీ హోదా కల్పించి సామాజిక న్యాయం చేయాలని అఖిల భారత మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కూలే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 22 ఏళ్లుగా మాలీ కులస్తులు ఎస్టీ హోదా కోసం చేస్తున్నా పోరాటాలను ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. ఫిబ్రవరి 10న ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసిందని గుర్తుచేశారు. ఈ బిల్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. ఈనెల 10న జిల్లా కేంద్రానికి రానున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దృష్టికి బీజేపీ నాయకులు తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న సేండే, రాష్ట్ర కోశాధికారి సతీశ్ గుర్నూలే, జిల్లా అధ్యక్షుడు విజయ్ వాడగురే, ఉద్యోగ సంఘాల అధ్యక్షులు చంద్రశేఖర్ అంబేద్కర్, కోశాధికారి భాస్కర్ ప్రధాన్, కార్యవర్గ సభ్యులు అనిల్ కోట్రంగే, శ్రీను గురునులే (ఆచారి) అంబాదాస్ శేండే, శివాజీ గురునులే తదితరులు పాల్గొన్నారు.


లారీలో మృతదేహం కలకలం

- టోల్‌ప్లాజా వద్ద ఘటన
- కేసు నమోదు

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ సమీపంలో టోల్‌ప్లాజా వద్ద 44వ నంబరు జాతీయ రహదారి పక్కన నిలిపి ఉన్న లారీ (ఎంహెచ్40 సీడీ 1201)లో ఆదివారం మృతదేహం కలకలం రేపింది. ఆగిఉన్న లారీలో ఉలుకు పలుకులేకుండా ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు రంగంలోకి దిగి లారీ యజమానిని ఆరా తీయగా మృతుడు లారీ డ్రైవర్‌గా తేల్చారు. ఎస్సై పురుషోత్తం కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా రాలేగావ్ తాలుకా ధనోరా గ్రామానికి చెందిన కాంబ్లే రవీందర్ గత 20 ఏళ్లుగా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 2న కాయిల్ లోడ్‌తో నాగ్‌పూర్ నుంచి బెంగుళూర్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో పాటన్‌బోరికి చెందిన అతని స్నేహితుడు అంత్యక్రియలకు వెళ్లి పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద చేరుకున్నాడు. అనారోగ్యంతో లారీ క్యాబిన్‌లో పడుకోగా, నిద్రలోనే తుదిశ్వాస విడిచాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుడి సోదరుడు కాంగ్లే సిద్దార్థ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పప్పుల ధరలు పైపైకి..

- ఆకాశాన్నంటిన నిత్యావసరాలు
- సామాన్యులు కొనలేని పరిస్థితి



బోథ్: నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పప్పుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో కంది పప్పు కిలో రూ.200లకు పైగానే ఉంది. వీటి ధరలు ఇంకా పెరగనున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. వచ్చే వారంలో 2 నుంచి 3 శాతం వరకు పెరగనున్నట్లు తెలుస్తోంది. దీంతో జనాలు వీటిని కొనాలంటేనే భయపడుతున్నారు.

సామాన్యులు కొంటలేరు..

పప్పుల ధరలు పెరిగిపోవడంతో ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కంది పప్పు కిలో రూ.200, మినపప్పు రూ.80 నుంచి రూ.100, పెసర పప్పు రూ.90 నుంచి రూ.100, వేరుశనగ రూ.95 నుంచి 120 ధర వరకు ఉన్నాయి. రైతులు పండించిన పంటలు వ్యాపారుల చేతులోకి వెళ్లడంతో వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. వారానికి కొంత ధర పెంచడంతో వీటిని కొనడానికి జనాలు రావడం లేదు.

తగ్గిన పప్పు దినుసుల సాగు

జిల్లాలో వాణిజ్య పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పత్తి, సోయాబీన్‌తోపాటు ఆయిల్ పామ్ పంటలు వేస్తున్నారు. ఇందులో పత్తి, సోయా పంటలపై మొగ్గు చూపుతున్నారు. పప్పు దినుసుల సాగు పడిపోయింది. కంది సాగుకు రైతులు ఆసక్తి కనబర్చడం లేదు. ఈ పంట ఆరు నెలలు. ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. వాతావరణం అనుకూలించకపోవడంతో నాలుగు నుంచి 5 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం రూ.6950 కనీస మద్దతు ధర ప్రకటించింది. కందికి డిమాండ్ పెరగడంతో మార్కెట్‌లో రైతులు క్వింటాకు రూ.11,500 వరకు వ్యాపారులు పోటీపడి కొంటున్నారు. పప్పులను వ్యాపారులు దిగుమతి చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

ధరలపై నియంత్రణేది?

కందితోపాటు పలు చిరుధాన్యాల ధరలు నానాటికీ పెరుగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ధరలు నియంత్రించాల్సిన అవసరం ఉంది. గతంలో కంది పప్పును రేషన్ దుకాణాల్లో సబ్సిడీపై ఇచ్చేవారు. పేద, మధ్యతరగతి ప్రజలు రేషన్ దుకాణాల్లో కొనుక్కునేవారు. కాని, ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. దీంతో పేదప్రజలకు కంది పప్పును బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధరలో లభ్యమవుతోంది. ధరలు అధికంగా ఉన్నప్పుడు ప్రభుత్వాలు ధరలు నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

కందికి మద్దతు..

సంవత్సరం	ధర
2020-21	రూ.6000
2021-22	రూ.3600
2022-23	రూ.6600
2023-24	రూ.6950

కొనలేకపోతున్నాం



పెరిగిన ధరలతో కంది పప్పును కొనలేకపోతున్నాం. కిలో కంది ధర రూ.200గా ఉంది. ప్రభుత్వం ధరలను నియంత్రించాలి. రేషన్ దుకాణల్లో సబ్సిడీపై కంది పప్పును అందించాలి. లేకపోతే కందిపప్పు కొనలేని పరిస్థితి. ప్రభుత్వం ధరలను నియంత్రించి, పేదలకు ఆదుకోవాలి.

– మల్లెపూల విజయ్‌కుమార్, బోథ్

ధరలు తగ్గించాలి



కంది పప్పు ధరలు తగ్గించాలి. అధిక ధరల వల్ల కొనలేకపోతున్నాం. రూ.100 ఉన్న పప్పు ధర ప్రస్తుతం మార్కెట్‌లో రూ.200 అయింది. దీంతోపాటు అన్ని పప్పుల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ప్రభుత్వం ధరలను తగ్గించే ప్రయత్నం చేయాలి. లేకపోతే పప్పులను తినలేని పరిస్థితి ఉంటుంది.

– నవీన్ కుమార్, బోథ్

ఆటో బోల్తా





చికిత్స పొందుతున్న రాధ, శైలజ

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ సమీపంలో ఆదివారం ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఖానాపూర్ నుంచి రాజురా గ్రామానికి సుమారు 10 మంది ప్రయాణికులతో ఆటో వెళ్తోంది. సింగాపూర్ సమీపంలో కొండెంగలు అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను ఖానాపూర్ తరలించి ప్రథమ చికిత్స చేశారు. తీవ్ర గాయాలైన సుర్జాపూర్ గ్రామానికి చెందిన అనుపు రాధ, వసంత, లక్ష్మణ్, ముత్తన్న, ప్రవళికను మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌కు తరలించారు. గాయాలైన సింగాపూర్‌కు చెందిన శైలజ, ఆశవర్కర్ లావణ్య ఖానాపూర్‌లో చికిత్స పొందుతున్నారు. వీరితోపాటు మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది.

ఆపదలో అండగా..

- ఆర్థికసాయం అందించిన మిత్ర బృందం
- వాట్సాప్ ద్వారా దాతల నుంచి విరాళాలు



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న మిత్రబృందం సభ్యులు

ఉట్నూర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందుతున్న మండలంలోని గొట్టిపటార్‌కు చెందిన నిరుపేద గిల్బే నితిన్‌కు మిత్రబృందం అండగా నిలిచింది. నాగాపూర్ సమీపంలో రెండు నెలల క్రితం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆయనకు వైద్యఖర్చుల నిమిత్తం మిత్రబృందం కాంబ్లే ప్రజ్ఞశీల్, నాగసేన్ మాన్కర్ వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా దాతల నుంచి విరాళాలు సేకరించారు. రూ.60 వేల నగదు, రూ.11 వేల విలువ నిత్యావసర సరుకులను ఆదివారం బాధిత కుటుంబీకులకు అందజేశారు. తమకు అండగా నిలిచిన హరీశ్, ఆత్రం ఉపేందర్, సుభాశ్ బొంకంటి, స్వామి కొల్లూరి, బండి విజయ్, దాతలకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కుమురం భీం ఉత్సవ కమిటీ ఎన్నిక



ఆత్రం బొజ్జిరావు



పెందోర్ లక్ష్మణ్

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో ఈ నెల 28న కుమురంభీం 83వ వర్ధంతి సందర్భంగా రాయిసెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుమురం సోనేరావు, చైర్మన్‌గా ఆత్రం బొజ్జిరావు, కన్వీనర్‌గా పెందోర్ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శులుగా మడావిరాజు, కుమురం ఎశ్వంత్‌రావు, సభ్యులుగా కే న్యానేశ్వర్, రామారావు, ఎస్.ఆనంద్‌రావు, కే.దత్తు, ఏ.సోనేరావు, ఏ చందన్‌షావ్, ఎం.ఎల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఏడాదిపాటు పనిచేయనుంది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం, ఆత్రం లక్ష్మణ్, కోవ విజయ్, కుమురం భీంరావు, మోతిరాం, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



కడెం: బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎస్సై రాజు

దస్తురాబాద్: మండలంలోని ఎర్రగుంట గ్రామంలో ఆదివారం గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. వెయ్యి లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎస్సై బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్సై మాట్లాడారు. నిషేధిత గుడుంబాను తయారు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామంలో ప్రతీ రోజు తనిఖీ చేపడుతామన్నారు. ఈ దాడుల్లో పోలీసులు జె.లక్ష్మణ్, కె.దివాకర్, ఎస్.డి. షఫీఉద్దీన్, రవి తదితరులు ఉన్నారు.

కడెం: మండలంలోని పెద్దూర్‌తండాలోని గుడుంబా స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నగవత్‌రమేశ్ ఇంటి వద్ద 500 లీటర్ల బెల్లం పానకాన్ని ఎస్సై కొనన రాజు పారబోశారు. పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ తండాలో ఆదివారం రాత్రి పంటచేలలో గుడుంబా స్థావరాలపై ఎస్సై యాసిర్ అరాఫత్ దాడులు నిర్వహించారు. అక్కడ ఉన్న 300 లీటర్ల బెల్లం పానకాన్ని, మత్తు పదార్థాలను ధ్వంసం చేశారు.

నిర్మల్‌రూరల్: నీలాయిపేటలో గుడుంబా స్థావరంపై రూరల్ పోలీసులు దాడి చేశారు. మహిళ గుడుంబా తయారుచేసి అ మ్ముతుందన్న సమాచారంతో మహిళా సిబ్బందితో కలిసి వెళ్లారు. 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చే సుకుని ధ్వంసం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

నర్సాపూర్(జి): బూర్గుపల్లి(జి) గ్రామంలో 10 లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ పేర్కొన్నారు. పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

బావిలో పడి యువతి మృతి

ఇంద్రవెల్లి: బహిర్భుమికి వెళ్లిన యువతి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందింది. మండలంలోని అంజీ గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై డి.సునీల్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దాండేగావ్‌కర్ మోతిరాం, సార్జాబాయి దంపతులకు కుమార్తె రేణుక(18) ఉన్నారు. గత నాలుగేళ్లుగా మతిస్థిమితి కోల్పోయి ఇంట్లోనే ఉంటుంది. ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం అందించిన ఆరోగ్యం కుదుటపడలేదు. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లి అదేగ్రామానికి చెందిన రైతు గారుశే సదాశివ్ వ్యవసాయ బావిలో పడి మృతిచెంది ఉంది. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.